తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# నిండు కుండలా గంగ కాలువలో నీరు

## -చెన్నైకు 400 క్యూసెక్కుల నీరు విడుదల



తొట్టంబేడు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : కండలేరు డ్యాంలో 10టిఎంసిల నీరు ఉన్నా ప్రజల దాహార్తిని తీర్చడానికి తెలుగుగంగ కాలువలో నీటిని విడుదల చేశారు. ఈనేపథ్యంలో గంగ నిండుకుండలా గలగల మంటూ కాలువలో నీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం కాలువలో 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలుగుగంగ ఈఈ సుబ్రమణ్యం తెలిపారు. కేవలం తాగునీటికి మాత్రమే అని ఇంకా చెరువులకు విడుదల చేయలేదన్నారు. చెన్నైకు 400 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు వివరించారు. చెన్నైకు ఒక్కటే కాకుండా, తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంటలకు తాగునీటి దాహార్తికి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. అయితే కాలువలో ఎవ్వరు దిగవద్దని గట్ల వద్ద మహిళలు ఎవ్వరు కూడా దుస్తులు ఉతకడం, యువకులు ఈతకు దిగడం పనులు చేయవద్దని ఈఈ తెలిపారు. చెరువులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత నీటిని విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే అన్నదాతలు వరికోతలు పూర్తయ్యాయని మరో పంట వేసేందుకు సిద్దంగా ఉన్నారని ప్రస్తుతం దుక్కులు దున్నుతున్నారు. త్వరలోనే అన్నదాతలకు కూడా నీటిని అందిస్తామన్నారు.

# మనోభావాలు దెబ్బతీస్తున్న సిఎం : ఎమ్మెల్సీ



గూడూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను దిగజారుస్తూ గౌరవాన్ని తగ్గిస్తూ చంద్రబాబు అసత్య ప్రచారంతో హింధు మనోభావాలు దెబ్బతిన్నాయని ఎమ్మెల్సీ మేరిగ మురళిధర్ సిఎం చంద్రబాబును విమర్శించారు. గూడూరులోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డూలో కల్తీ నెయ్యి లేదంటూ సాక్షాత్తు టిటిడి ఇఓ శ్యామల రావే చెప్పాడని సిఎం చంద్రబాబు చేసిన పాపానికి రాష్ట్రవ్యాప్తంగా జగన్మోహన్ రెడ్డి పిలుపుతో ప్రాయశ్చిత పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాకాణి తెలిపారు. వంద రోజుల పాలనలో ఏమీ చేయలేక ప్రజల నుండి పదవి విరుపుతో డైవర్షన్ రాజకీయాలకు తెరతీసాడని ఆయన అన్నారు. తండ్రి లాంటి మామనే వెన్నుపోటు పొడిచిన చరిత్ర గల చంద్రబాబు ఆయన రాజకీయ లబ్ధికోసం వెంకటేశ్వర స్వామిని కూడా రాజకీయాలకు లాగడం సిఎం చంద్రబాబు నైజమని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా తిరుమల లడ్డు విషయంలో వచ్చిన ఆరోపణలో నెయ్యిపై నిగ్గు తేల్చే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే సిబిఐ చేత గానీ, హైకోర్టు, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిల చేత విచారణ చేయించి వాస్తవాలు బయట పెట్టాలని ప్రధానమంత్రిని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిని విజయ్ కుమార్, కొడవలూరు ధనంజయ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, దువ్వూరు మధుసూధన్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షులు సాయి ప్రసాద్ రెడ్డి, సునీల్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంతకీ బాధ్యత ఎవరిది!

**- ఎస్ఆర్ పురం అక్రమ క్వారీ మైనింగ్‌పై చర్యలు తీసుకొనేది ఎవరు! - మండలం మీదుగా యదేచ్ఛగా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం ఎలా!**



చిత్తూరు, శ్రీరంగరాజపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: శ్రీరంగరాజపురం మండలం పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురం గ్రామ పరిసరాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎవరిదనే విషయంపై తెలియని పరిస్థితి నెలకొంది. పై స్థాయి అధికారుల నుండి ఆదేశాల వస్తే ఆ ఆదేశాల మేరకు తాము వెళ్ళి చర్యలు తీసుకుంటామని క్షేత్ర స్థాయి అధికారులు పేర్కొంటున్నారు. అయితే పై స్థాయి అధికారుల్లో ఈ విషయంపై ఇప్పటి వరకు చలనం లేకపోవడంతో ఈ క్వారీల్లో అక్రమ మైనింగ్ యదేచ్ఛగా సాగుతుంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడటంతో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ గనుల శాఖ పరిధిలో జరుగుతున్న మైనింగ్ విషయాలపై జిల్లాల వారీగా సర్వే నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సర్వే కార్యక్రమంలో మండల స్థాయిలో రెవెన్యూ తరపున తహసిల్దారు ఆధ్వర్యంలో సర్వేయర్లు, భూగర్భ గనుల శాఖ నుండి ఒక అధికారి వచ్చారు. ఈ మేరకు సర్వే నిర్వహించిన అనంతరం రెవెన్యూ అధికారులు తమ మండల పరిధిలో జరుగుతున్న మైనింగ్ పనులకు సంబంధించి కలెక్టర్‌కు ఓ నివేదిక ఇచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాత మైనింగ్ విదానానికి బ్రేక్ వేసి కొత్త మైనింగ్ విధానం అమలులోకి తీసుకురావడంపై ప్రస్తుతం కసరత్తు జరుగుతుంది. ఈ క్రమంలో జిల్లాలో ఎక్కడా మైనింగ్ క్వారీలు, గ్రానైట్ రాళ్ళ తరలింపుకు అక్కడ అనుమతి ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఎస్ఆర్ పురం మండలం పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురం గ్రామ పరిసరాల్లోని క్వారీలో మాత్రం పనులు ఎలా జరుగుతున్నాయి! ఇక్కడి నుండి క్వారీ రాళ్ళు ఎక్కడికి తరలి వెళ్తున్నాయి! ఇక్కడి నుండి ఇటు చిత్తూరు, పలమనేరు వైపుకు వెళ్ళాలంటే ఎస్ఆర్ పురం, జిడినెల్లూరు, చిత్తూరు, బంగారుపాళ్యం మండలాల్లో పోలీసులు, ఇతర శాఖల అధికారులు వున్నారు. వీరు తనిఖీలు నిర్వహిస్తే ఒక్క ముక్క గ్రానైట్ రాయి సైతం ఒక చోటు నుండి మరొ చోటుకు కదిలే ప్రసక్తే వుండదు. అలాగే అటు వైపు తమిళనాడుకు తరలించాలంటే సరిహద్దు చెక్‌పోస్టును దాటి వెళ్ళాల్సి వుంటుంది. క్వారీ నుండి గ్రానైట్ రాయిని ఎక్కడికి తీసుకెళ్ళాలను కున్నప్పటికీ ఎక్కడో ఒక చోట ఎదో ఒక శాఖ అధికారి కన్ను పడటం ఖాయం. ఇంత మంది అధికారుల కన్నుగప్పి క్వారీ నుండి యధేచ్ఛగా రాళ్ళను లారీల్లో తరలిస్తున్నారంటే క్షేత్ర స్థాయి అధికారులు క్వారీ నిర్వాహకులతో లాలుచీ పడి వుండాలి. లేదా అన్ని శాఖల అధికారుల కళ్ళను గప్పి అర్థరాత్రి సమయాల్లో క్వారీ రాయి లారీ లోడ్‌ను నిర్ధేశించిన ప్రాంతానికి నిర్వాహకులు తరలించాల్సి వుంటుంది. ఇదిలా వుంటే భూగర్భ గనుల శాఖ కార్యాలయంలో ప్రస్తుతం పని చేస్తున్న క్వారీల జాబితాలో పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురం గ్రామ పరిసరాల్లోని క్వారీ లేదు. అయితే ఇక్కడ పనులు ఎలా జరుగుతున్నాయి! ఈ జరుగుతున్న పనుల వెనుక వున్న అదృశ్య వ్యక్తి ఎవరు! క్షేత్ర స్థాయి అధికారులు ఈ విషయంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు! పై స్థాయి అధికారులు సైతం దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదు! అనే అనుమానాలు అందరిలో నెలకొంటున్నాయి. ఈ విషయంపై పై స్థాయి అధికారులతో పాటు క్షేత్ర స్థాయి అధికారులు స్పందించి వాస్తవాలు వెల్లడించాల్సి వుంది.

## 'కల్తీ'నెయ్యి బాగోతంలో
# సిట్ ఫోకస్ ఎవరిపైనో!?

**-దర్యాప్తు మొదలుపెట్టిన విచారణ బృందం**



తిరుమలలో సిట్ అధికారులు

తిరుమల,సెప్టెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూల తయారీకి జంతువుల కొవ్వు,చేపనూనె, పలు రకాల శాఖాహారపదార్థాల నూనెలతో కలసిన "కల్తీనెయ్యి" బాగోతంలో సిట్ బృందం ఎవరిపై ఫోకస్‌చేస్తుందనేది ఇప్పుడు సంచలనంగా మారింది. ఈ బృందంలోని ఐజి సర్వశ్రేష్ఠత్రిపాఠి, డిఐజి గోపీనాధజెట్టీ, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుసభ్యులు శనివారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. పద్మావతి విశ్రాంతి గృహంలో టిటిడి అధికారులు, పోటు విభాగం కార్మికుల నుండి వివరాలు సేకరించారు. అనంతరం తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం మళ్ళీ తిరుపతికి చేరుకుని తమ దర్యాప్తు కొనసాగించారు. కల్తీ నెయ్యి దేవుని లడ్డూ తయారీలో ఉపయోగించారనే వివాదంలో ప్రస్తుతం ఏం జరగబోతోందనే ఉత్కంఠ ప్రతిఒక్కరిలోనూ నెలకొంది. స్వామివారి లడ్డూ ప్రసాదాలను పవిత్రంగా తయారుచేశామని, తామెలాంటి తప్పులు చేయలేదని గత బోర్డులోని పెద్దలు ప్రమాణం చేశారు. అంతేగాక 3.50లక్షల వరకు లడ్డూలు తయారుచేసేందుకు వినియోగించిన నెయ్యిలో ఎలాంటి కల్తీ లేదని ప్రకటించారు. ఇప్పుడు సిట్ బృందం తిరుపతిలో మకాం వేసి వివరాలు సేకరణ, సంబంధిత అధికారులు, ఉద్యోగులు నుండి సమాచారం రాబడుతోంది. లడ్డూలకు జంతువుల కొవ్వు, ఇతరత్రా నూనెలు కలసిన కల్తీ నెయ్యి వినియోగించారనేది ల్యాబ్ రిపోర్టుల ఆధారాలతో వెల్లడించడం విశేషం. ఈ నేపథ్యంలో సిట్ విచారణ అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. తొలిరోజు కల్తీనెయ్యి సరఫరాకు టెండర్లు పిలిచిన టిటిడి బోర్డు ఛైర్మన్, కొనుగోలు కమిటీలో సభ్యులు ఎవరున్నారనే సమాచారం సేకరించారు. దీనికి సంబంధించి కొన్ని రికార్డులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

# అబద్ధం చెప్పి దబాయిస్తే అది నిజమవ్వదు : రోజా

**డిక్లరేషన్‌కు భయపడే పర్యటన రద్దు చేసుకున్నారని చంద్రబాబు అండ్ కో చెప్పడం విడ్డూరం**



సమావేశలంలో మాట్లాడుతున్న రోజా

నగరి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త: అబద్ధాలు చెప్పేసి దాన్ని నిజం చేయాలని చంద్రబాబు అనుకుంటే అది ఆయన భ్రమే అని వైసీపీ మాజీ మంత్రి రోజా అన్నారు. వైసీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ తిరుమల పర్యటన రద్దు కావడం పట్ల ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఆమె శనివారం ఈ మేరకు స్పందించారు. పర్యటన ఎందుకు రద్దు చేసుకున్నారో స్పష్టంగా ప్రెస్ మీట్ పెట్టి మరి చెప్పడం జరిగిందన్నారు. ఆయన డిక్లరేషన్‌కు భయపడే పర్యటన రద్దు చేసుకున్నారని చంద్రబాబు అండ్ కో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఆయన శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, వైసీపీ ఐదేళ్ల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారని ఇది ప్రతిఒక్కరికి తెలుసనన్నారు. కాగా నేడు ఆయనేదో తొలిసారి తిరుమలకు విచ్చేస్తున్నట్లు డిక్లరేషన్ కోరడం మత రాజకీయాల్లో భాగమే అన్నారు. వెంకటేశ్వర స్వామికి నిజమైన భక్తునిగా ప్రశాంతంగా భగవంతుని ప్రార్థించుకునేందుకు వస్తే మత ద్వేషాలు సృష్టించి అలజడి సృష్టించేందుకు కూటమి పార్టీలు ప్రయత్నించిందని, పార్టీ నేతలకునోటీసులు ఇవ్వడం జగన్‌ని కలవడానికి వెళ్లితే అరెస్టుచేస్తామని బెదిరించడం చేశారన్నారు. మతం పేరుతో చేసే ఈ కుయుక్తులకు జనం బలికాకూడదని, మరో మారు దర్శించుకుందామని జగనన్న తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారన్నారు. మానవత్వం తన మతం అని చాటుకున్నారన్నారు. అంతే కాని భయం అన్నది ఆయన బ్లడ్‌లోనే లేదన్నారు. జగన్ దమ్ము, ధైర్యం గురించి రాష్ట్ర ప్రజలకు తెలుసనన్నారు. దేవుడంటే చంద్రబాబుకు భయం లేదు కనుకే ఆయనను కూడా రాజకీయంలో పావుగా వాడుకుంటున్నారన్నారు. ఆయనకు భగవంతుడే గట్టిగా సమాధానం చెబుతాడు.

# గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం



కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాల చివరిరోజు శుక్రవారం రాత్రి గణనాధునికి గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 21 రోజులు పాటు జరిగిన సా ్వమివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి జరిగిన తెప్పోత్సవంతో ఘనంగా ముగిశాయి. తెప్పోత్సవం అనంతరం సా ్వమివారికి గ్రామోత్సవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తెప్పలపై విహరించి సేదతీరిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవ మూర్తులకు తిరిగి గ్రామోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు వంటి వివిధరకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈసందర ్భ ంగా నారికేళ, కర్పూర హారతులతో స్వామివారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ జగన్నాధరెడ్డి,ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## దడ పుట్టిస్తున్న...
# నూనె, బియ్యం ధరలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:మార్కెట్‌కువెళ్ళి సరకులు కొందామంటే సామాన్యుని కంట నీరు వస్తుంది. ముఖ్యంగా వంట నూనెల ధరలు సల సల కాగుతున్నాయి.బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి.ఉల్లి,వెల్లులి ధరలు కంట నీరు తెప్పిస్తుండగా రాబోవు రోజుల్లో అన్నం కూడా కరువు అయ్యే పరిస్థితి చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం వంటనూనెల దిగుమతిపై సుంకం 20శాతం విధించగా మార్కెట్‌లో ఒక కిలో పామోలిన్‌పై రూ.40లు పెరిగింది.బియ్యం ధరలు కిలో 60 నుంచి 70కి పెరిగింది.ఉల్లి ధర కిలో రూ.60దాటగా వెల్లులి పెద్ద సైజ్ కిలో రూ.500లు దాటింది. సమాజంలో రోజు రోజుకు బతుకు భారంగా మారుతుంది.ఈ నేపథ్యంలో నెలరోజుల క్రితం మార్కెట్లో ఉన్న ధరలకు నేటి ధరలకు ఎంతో వ్యత్యాసం చోటు చేసుకుంది. ముఖ్యంగా పప్పుల ధరలు దడ పుట్టిస్తుండగా రాబోవు రోజుల్లో అన్నం మెతుకు కూడా కరువే ఏమో అనే భయం సామాన్యుల్లో పట్టుకుంది. అయితే ధరలను నియంత్రిం చాల్సిన ప్రభుత్వ శాఖలు పట్టించుకోవటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. మరీ ఇంత ధరల పెరుగుదలా?అని జనం తల్లడిల్లుతున్నారు. అయితే నూనె ధరలు ఉపశమనం కల్పిస్తున్నాయి. గత నెల రోజులుగా క్రమంగా కందిపప్పు, మినపపప్పు,పెసర పప్పుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. నెల రోజుల్లో కందిపప్పు ధర 60శాతం పెరిగింది. దాంతో కొనుగోలు దారుడు బెంబేలెత్తుతున్నాడు. వివరాలను పరిశీలిస్తే మేలు రకం కందిపప్పు ధర 15రోజుల క్రితం కిలో రూ.160 నుంచి 170లుండేది. శనివారం మార్కెట్లో సచిన్ బ్రాండ్ కందిపప్పు కిలో రూ.200 తాకింది. ఇక మినప పప్పు ధర కిలో రూ.120 ఉంటే నేడు రూ.140 దాటింది. పెసరపప్పు ధర కిలో రూ.100నుంచి 125లకు పెరిగింది. ఇలా పప్పుల ధరలు పెరుగుతున్నాయి. ఇక కందిపప్పును రేషన్ షాపుల్లో ఇస్తారు.కానీ అది నాసిరకంగా ఉందని వాపోతున్నారు. కానీ రెండు నెలలుగా అది కూడా అందించటం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతి ఇంటిలో ప్రతిరోజూ పప్పు వాడకం ఉంటుంది. రేషన్ షాపుల్లో ఇచ్చే కిలో,అర్థకిలో ఎక్కడకు సరిపోతుందని వాపోతున్నారు.

**బియ్యం ధరలకు రెక్కలు:**

రోజంతా కష్టపడితే వచ్చే కూలితో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు బియ్యమో, నూకలో కొనుగోలు చేసి గంజి నీళ్ళు తాగే వారు. అయితే గత వారం రోజులుగా మార్కెట్లు బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పచ్చిబియ్యం కిలో రూ.65కు చేరింది. సాధారణ రకాలు రూ.55 నుంచి 60 మధ్య ఉంది.ఇక ఇడ్లీ తయారుచేసే బుడ్డల బియ్యం రూ.32 ఉండగా నేడు 45కు చేరింది. కొందరుకూలీలు నూకలతో గంజికాసుకొని తాగేవారు. నూకల కిలో రూ.31 ఉండగా నేడు 40కు చేరింది. ఇలా బియ్యం ధరలు పెరుగుతుంటే సామాన్యుడు బెంబేలెత్తుతున్నారు. తాము సంపాదిస్తున్న సంపాదన కనీసం పప్పు,బియ్యానికి కూడా సరిపోవటం లేదని వాపోతున్నారు. మరి ధరలను నియంత్రించాల్సిన వ్యవస్థలు మౌనం వహించటం సామాన్యునికి కలవరపెడుతుంది. సామాన్యుని బతుకుభారంగా మారింది.

# కుప్పంలో శాశ్వతంగా ఎగిరేది తెలుగుదేశం జెండానే

**- ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం - ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం -పార్టీ కోసం కష్టించిన వారికి తప్పక గుర్తింపు**



కుప్ప ం, సెప్టెంబర్ 28 ప్రభాతవార ్త : కుప్పంలో శాశ్వతంగా ఎగిరేది తెలుగుదేశం పార్టీ జెండాయేనని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాభైవేల ఉద్యోగులు పనిచేస్తున్న ఆర్టీసీని లాభాల పట్టిస్తామని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడుపై తనపై ఎంతో విశ్వాసంతో తనకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పగ్గాలు అప్పగించారని ఆ నమ్మకానికి తగినట్లు పనిచేస్తానన్నారు. తాను ఏనాడూ పదవులు కోరుకోలేదని పేర్కొన్నారు. గతంలో సైతం తనపై నమ్మకంతో సిఎం చంద్రబాబు రెస్కో బాధ్యతలు అప్పగించారన్నారు. 2024 ఎన్నికల్లో వైకాపాతో కుప్పంలో యుద్ధం చేశామన్నారు. వైకాపా నేతలు పలు అరాచకాలు చేశారని వాటిని అడ్డుకుని కార్యకర్తలు, నాయకులు పనిచేశారన్నారు. స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా నేతలు ప్రజలను భయభ్రాంతులను గురి చేశారన్నారు. తెదేపా నేతలు, కార్యకర్తలు ఐదేళ్ల పాలనలో పలు కేసులు ఎదుర్కొన్నారన్నారు. అలాంటి వారికి సిఎం చంద్రబాబునాయుడు తగిన గుర్తింపు ఇస్తారన్నారు. ముమ్మందు మరిన్ని నామినేటెడ్ పదవులు కష్టపడిన వారికి లభించేలా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటుందన్నారు. పార్టీ కార్యకర్తలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా సైతం తగు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. రానున్న ఐదేళ్లలో కుప్పం సమగ్ర అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధికి గ్రామ వికాస పత్రాలు రూపొందించామని వాటిని సిఎం ఆదేశాలతో అమలు చేస్తామన్నారు. తనకు రాజకీయంగా ఎలాంటి గ్రూపులు లేవని తనకు కులం,మతం అనే పట్టింపులు లేవన్నారు. తనకు పదవి వచ్చినా తనతో పాటు నిలిచిన పార్టీ కార్యకర్తలు, నేతలను మరువనని పేర్కొన్నారు. అనంతరం వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంను నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేతలు శాంతారాం, డా॥ వెంకటేష్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, ఆర్ఆర్‌రవి, మంజు, రామచంద్ర, మణి, ఎవి రవి, రవి, మహేం ద్ర, సుబ్బు, వసంతమ్మలు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో మొగిలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి చర్యలు

**కలెక్టర్ సుమిత్‌కుమార్ జాతీయ రహదారులు, రవాణా శాఖ అధికారులను ఆదేశం**



మొగిలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: మొగిలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి చేపట్టే చర్యలను వారం రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ జాతీయ రహదారులు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ మొగలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి తీసుకోవాలల్సిన చర్యలపై జాతీయ రహదారులు, రవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చేపట్టే చర్యలు వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మొగిలి ఘాట్ వద్ద ఒక చెక్‌పోస్టును ఏర్పాటు చేసి ఒక అంబులెన్స్, ఒక క్రేన్‌ను అందుబాటులో వుంచాలన్నారు. మొగలి ఘాట్ డేంజర్ జోన్‌గా వాహనదారు లకు తెలియజేయడానికి ప్రతి 200 మీటర్లకు ఒక చోట వివిధ భాషల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పెట్రోలింగ్ వాహనంను అందుబాటులో వుంచాలని, అలాగే పటిష్టంగా బ్యారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. దీనితో పాటు సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం ముఖ్యమన్నారు. అలాగే థర్మల్ ప్లాస్టిక్, డ్రమ్స్ స్టిక్కర్స్, బీటీరంబ్లిక్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించేలా జాతీయ రహదారికి ప్రక్కనే అంబులెన్స్‌ను అందుబాటులో వుంచాలన్నారు. రోడ్లపై అతి వేగ నియంత్రణకు పక్కాగా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా మొగిలి ఘాట్‌లో తరచు ప్రమాదాలు జరుగుతున్న విషయంను స్పష్టంగా తెలిసేలా ప్రాణం యొక్క విలువ తెలిసేలా అతివేగం అనర్థం అనే విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందన్నారు. మొగిలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి చేపడుతున్న ముందస్తు పనులను వారం లోపు పూర్తి చేయాలని జాతీయ రహదారుల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ పిడి వెంకటేశ్వర్లు, డిటిసి నిరంజన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ శంకర్ నారాయణ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు మంచి బుద్ది ప్రసాదించు



పాలసముద్రం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: తిరుమల లడ్డు ప్రసాదంపై అవాకులు చావాకులు వల్లె వేస్తున్న సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని పాలసముద్రం వైకాపా మండల అధ్యక్షుడు తులసీయాదవ్ ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి శేఖర్ మందడి, నాయకులు శనివారం శ్రీబాల గురునాధేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి శేఖర్ మందడి మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దెబ్బ తీశారని, ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు భక్తులు వీరి మాటలు విని కలత చెందారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసీ అన్బుగలన్, మాజీ జడ్పీటిసి సుందరరాజు, సర్పంచ్‌లు అయ్యప్ప, లిల్లీ ఆనంద్, జీవిత భాస్కర్, అనురేఖ, నాయకులు వెంకటేశులు మందడి, షణ్ముగరెడ్డి, ధనంజయరెడ్డి, ఆరుళ్‌నాధన్, తిరుమల తదితరులు పాల్గొన్నారు

## తిరుమల కొండ పవిత్రతను పరిరక్షించండి

పెనుమూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక తిరుమల కొండ పవిత్రతను పరిరక్షించాలంటూ మండల జనసేన, బిజెపి నాయకులు శనివారం మండలంలోని కలికిరి కొండ వెంకటేశ్వరాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు పామూరు శ్రీనివాసులు, బిజెపి అధ్యక్షుడు గుత్తా వాసునాయుడులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం పలు వివాదాలకు కారణం అయ్యిం దన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జికె ప్రసాద్, బాలాజీ, గురుప్రసాద్, బిజెపి నాయకులు పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రెండు లక్షలు విరాళం



కాణిపాకం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరుకు చెందిన పి.రఘురాం, హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ అనే భక్తులు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయల చొప్పున వేర్వేరుగా విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కొత్త గొల్లపల్లెలో అదుపుకాని అతిసార

తవణంపల్లె, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని నల్లిశెట్టిపల్లె గ్రామపంచాయతీ కొత్తగొల్లపల్లెలో అతిసార పూర్తిస్థాయిలో అదుపులోకి రాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కలుషిత త్రాగునీరు సేవించడం వల్ల మంగళవారం నుండి పలువురికి అతిసార వ్యాధి సోకి వాంతులు,విరేచనాలు కావడంతో వివిధ ఆస్పతుల్లో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు మంగళవారం ఐదు మందికి అతిసార సోకగా బుధవారం మరో పదిమంది వరకు ఈవ్యాధి సోకింది. అలాగే గురువారం కూడా ఈవ్యాధితో ఎనిమిది మంది ఆస్పత్రి పాలయ్యారు. అలాగే శుక్ర,శనివారాల్లో మరో ఐదు మందికి అతిసార సోకడంతో ఆస్పత్రిలో వైద్యసిబ్బంది వైద్య చికిత్సలు అందిస్తున్నారు.గ్రామంలో ఐదు రోజులు అవుతున్నా అతిసార వ్యాధి పూర్తిస్థాయిలో అదుపులోకి రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పరమహంస విద్యాలయకు డైనమిక్ స్కూల్స్ 2024 అవార్డు

శాంతిపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయానికి 2024 సం॥కు గాను డైనమిక్ స్కూల్ అవార్డు లభించింది. ఎడ్యుకేషన్ న్యూస్ నెట్‌వర్క్ బెంగళూరు వారు హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ ఇస్రో శాస్త్రవేత్తలు మరియు లైవ్ ఫౌండేషన్ అధినేత డా॥ గిరీష్ కన్నన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఎపి, కర్ణాటక, తెలంగాణా, తమిళనాడు, ఒడిస్సా, బీహార్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన రెండు వందల పాఠశాలలకు ఈ అవార్డు దక్కింది. తమ పాఠశాల ఈ అవార్డు పొందినందుకు విద్యాలయ ఛైర్మన్ గోపాల్ జీ అగర్వాల్ విద్యాలయ సిబ్బందిని అభినందించారు.

## గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



శాంతిపురం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : మండలంలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వచ్చే నెల 15లోగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ప్రేమ్ రాజ్‌కుమార్ సూచించారు. శనివారం దండికుప్పం, కొలమడుగు, సొన్నేగానిపల్లి గ్రామాల్లో లేఔట్లను ఆయన పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ పరిశీలించారు. కూలీలకు విధిగా 150 రోజుల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు.

## సబ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ బాధ్యతలు

కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : కుప్పం సబ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన చిత్తూరు నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి లేకుండా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు.

## దళితవాడలో పౌర హక్కుల దినోత్సవం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని పొన్నాంగూరు ఎస్సీ కాలనీలో తహశీల్దార్ చిట్టిబాబు శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వాడల్లో సమస్యల పరిష్కారంకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, దళిత నేతలు అన్నాదొరై, కలైసెల్వం, గణేష్, సుధాకర్, అజిత్, వివిధ శాఖలఅధికారులు పాల్గొన్నారు.

## వరదబాధితులకై విద్యార్థులచే 55వేలు విరాళం



కుప్పంరూరల్, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : విజయవాడ వరద బాధితులకోసం కుప్పం హాకింగ్స్ స్కూల్ విద్యార్థులు తమవంతు సాయంగా 55వేల రూపాయల విరాళాన్ని అందించినట్లు స్కూల్ ఛైర్మన్ హఫీజ్ తెలిపారు. ఈసందర్భంగా విరాళాలు సేకరించిన చిన్నారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు షబ్బీర్, రఫీక్, వైస్ ప్రిన్సిపాల్ అరుణసింగ్ చౌహాన్, కోఆర్డినేటర్ నదియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైకాపా నేతలచే ఆలయంలో పూజలు

కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : వైకాపా అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వైకాపా నేతలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చీలేపల్లి రవి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు మోహన్‌రాం, నాగరాజు, మునిరాజు, రాజ్‌కుమార్, నేతలు కుమార్, పార్థసారథి, సునీల్‌శెట్టి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు

## కల్తీ నెయ్యిపై సిబిఐచే విచారణ జరిపించాలి : వైకాపా



చౌడేపల్లి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన వాదనలపై సిబిఐచే విచారణ జరిపించాలని రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ మాజీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు డిమాండ్ చేసారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల పిలుపు మేరకు స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో వైకాపా ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆసుపత్రి కమిటీ మాజీ ఛైర్మన్ కళ్యాణ్ భరత్, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ రవిచంద్రారెడ్డి, లక్ష్మీనరసయ్య, సర్పంచులు కృష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డు ప్రసాదం పవిత్రతను కాపాడండి

చౌడేపల్లి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : ప్రపంచ దేశాల్లో అత్యంత ధార్మిక వ్యవస్థ అయిన తిరుమల-తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలని బిజెపి మండలాధ్యక్షుడు మనోహర్ రాయల్ కోరారు. ప్రధాని నరేంద్రమోడీ, కూటమి ప్రభుత్వ పెద్దలు కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రక్షాళన చేసి భక్తుల మనోభావాలను కాపాడాలన్నారు. బిజెపి యువమోర్చా ఐటి జిల్లా కార్యదర్శి గందోడి ప్రవీణ్, శేఖర్‌బాబు, వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.70 లక్షలు జరిమానా

చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 17 మందిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 1.70 లక్షల రూపాయలు జరిమానా విధించారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు చిత్తూరు నగర పరిధిలో శుక్రవారం సాయంత్రం నుండి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీ నిర్వహించి పట్టుకున్నారు. జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు పేర్కొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా విధులు: కమీషనర్

చిత్తూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త: వర్షాల నేపథ్యంలో మున్సిపల్ ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు అప్రమత్తంగా వుండాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వర్షాలు పడిన సమయంలో నీటి ప్రవాహానికి అడ్డం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని ప్రజా ఆరోగ్య విభాగకమీషనర్ ఆదేశించారు. కమీషనర్ నరసింహప్రసాద్‌తో పాటు అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## తల్లిదండ్రులే విద్యార్థులకు మొదటి గురువులు



సోమల, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : విద్యార్థులకు తల్లిదండ్రులే మొదటి గురువులని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు అన్నారు. సోమ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రులతో అధ్యాపకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులను చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ అలవర్చి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రుల దేనని అన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాప ప్రక్షాళనకు వైకాపా పూజలు



సదుం,సెప్టెంబర్ 28ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాప ప్రక్షాళనకు సదుం మండలంలోని వైకాపా నాయకులు కార్యకర్తలు ఆలయాలలో పూజలు నిర్వహించారు. సదుం కొత్తపల్లెలోని శ్రీవెంకటే శ్వరస్వామి వారి ఆలయంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరగ్గా జోగివారిపల్లెలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జేసీస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, మండల వైకాపా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి, పుట్రాజు, శివారెడ్డి, రమణారెడ్డి, చిన్నారాయల్, శ్రీరాములు, రాజశేఖర్, జోగివారిపల్లె సర్పంచి అనితాకుమారి, రెడ్డెప్పరెడ్డి, రత్నశేఖరరెడ్డి, రామచంద్ర, ఎల్లారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేబిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



రొంపిచెర్ల,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు రేబిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దినేష్ కుమార్‌నాయక్ అన్నారు. శనివారం రొంపిచెర్లలో ప్రపంచ రేబిస్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. కుక్క కరచిన వెంటనే ఏంటీ రాబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ, ఎంపీహెచ్ఎస్ పంకజాక్షి,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం



కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత ఎంతో అవసరమన్నారు. పరిసరాలు శుభ్రంగా లేకుంటే ప్రజలు అంటు వ్యాధులు, రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యానికి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొంటూ ఆయనను అభినందించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, డిఎం పెంచలయ్య, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, వేలు, సురేష్, సెల్వరాజ్, జాకీర్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, మంజు, ఆర్‌ఆర్ రవి, రవినాయక్, శివ, అన్సర్, నాగభూషణం, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరుమగళ్, శారదమ్మ, బిజెపి శివశంకర్, జనసేన నరేష్, కుప్పం డిగ్రీ కాలేజ్, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు

## గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



కుప్పం, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలానికి సిమెంట్ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, బాతు రూముల నిర్మాణాల పనులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో నేతలు మహేంద్ర, రామచంద్ర, రాజగోపాల్, ఎవి రవి, బగ్గిడివెంకటేష్, శివకుమార్, రవి, మోహన్, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎన్‌బికెఆర్‌లో ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ

కోట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని ప్లాస్టిక్ వినియోగం ప్రపంచంలో ఇప్పుడు చాలా ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల మానవాళికి చాలా ప్రమాదకరమని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు.హెచ్ఓడి డాక్టర్ సి.రవీంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లుడాక్టర్‌సి.ఉదయ్‌కుమార్‌రాజు, డాక్టర్ వి.హరికృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లయిస్ డిటిగా మల్లికార్జునరావు

కోట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :

కోట తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ పనిచేస్తున్న మల్లికార్జునరావును కోట, వాకాడు, చిట్టమూరు మండలాల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి డీలర్లకు సరఫరా అయ్యే ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యాన్ని ఎండియు ఆపరేటర్ల ద్వారా సకాలంలో ప్రజలకు అందజేస్తామని చెప్పారు.

## కోట డిప్యూటీ తహశీల్దార్‌గా అజంతుల్లాఖాన్

కోట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :

కోట మండల డిప్యూటీ తహశీల్దార్‌గా అజంతుల్లాఖాన్‌ను జిల్లా కలెక్టర్ నియమించారు. అజంతుల్లాఖాన్ చిల్లకూరు మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్‌గా వెళ్లడంతో కోటకు అజంతుల్లాఖాన్‌ను నియమించారు.

## ఆలయంలో వైసీపీ నాయకుల ప్రత్యేక పూజలు

పెళ్లకూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపుతో పెళ్లకూరు మండలంలోని అన్ని పంచాయతీల్లోని ఆలయాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ పవిత్రతను కాపాడాలంటూ శాంతియుతంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు పంచాయతీ సర్పంచ్ హరిరెడ్డి, వైసీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, కన్నారెడ్డి, దామోదర్‌రెడ్డి, మురళీ, నాగరాజు, చంద్రబాబు, మణి, శ్రీనివాసులు, నాగార్జున, రవి, సుధాకర్, రవినాయుడు, రంగయ్య, చంటి, పోలయ్య, బాలయ్య, గ్రామంలోని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ నెలవలను కలిసిన టీడీపీ నాయకులు

పెళ్లకూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను పెళ్లకూరు మండలం కానూరు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శనివారం ఏకాదశిని పురస్కరించుకొని నెలవల సుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, వెంపల్లి వెంకటేశ్వర్లు, కొండూరు రామ్మోహన్‌రాజు, శేఖర్‌రాజు, నెలవల ప్రసాద్ యాదవ్, ప్రసాద్ రాజు తదితరులు ఉన్నారు.

## సూళ్లూరుపేట ఆర్డీఓగా కిరణ్మయి



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :

సూళ్లూరుపేట నూతన ఆర్డీఓగా కిరణ్మయి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆర్డీఓ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ ఉద్యోగుల సహకారంతో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రీవెన్స్‌డేలో వచ్చే సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఆమె తెలిపారు.

## తిరుమల లడ్డూ వివాదంపై తడలో వైసీపీ పూజలు



తడ, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తడ మండల వైసీపీ శ్రేణులు శనివారం తడ ఆలయంలో పూజలు చేసి తిరుమల లడ్డూపై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ ఆందోళన చేశారు. స్థానిక శ్రీకాళహస్తి రోడ్డులోని శ్రీనివాస పెరుమాళ్ ఆలయం వద్ద మండల వైసీపీ కన్వీనర్, తడ సర్పంచ్ ఆర్ముగం ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో చేరి పూజల్లో, ఆందోళనలో పాల్గొన్నారు. ఆలయం వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు.

## శ్రీ వేంకటేశ్వరునికి కస్తూరి చందనాలంకారం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



సూళ్లూరుపేటలోని శ్రీ మద్వేంకట రామమూర్తి దేవస్థానంలో పెరటాశి నెల రెండవ శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి కస్తూరి చందన అలంకారాన్ని చేశారు. ఆలయం వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. స్వర్ణ వర్ణపు రంగులో చందనంపై చంకీలు అద్ది స్వామివారి ప్రభకు చుట్టూ తులసీ మాలలతో అలంకరించి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు, వంశపారంపర్య దేవస్థాన ట్రస్టీ బీరక రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## ఆటో కార్మికులు సోదరభావంతో మెలగాలి

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



ఆటో కార్మికులు ఒకరిపై ఒకరు పోటీలు వేసుకొని శత్రుత్వంతో కాకుండా సోదర భావంతో మెలగాలని సిఐటియు కార్యదర్శి కె.లక్ష్మయ్య అన్నారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా సామంతమల్లాం, ఇలుపూరు, ఉచ్చూరు, తొగరాముడి గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఆటోస్టాండ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను సిపిఎం కార్యదర్శి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌ని సన్మానించిన ఉద్యోగులు

వెంకటగిరి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



నూతన పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్‌ని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్‌ని పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు అభినందనలు తెలియజేస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బడిమల సునీత, బడిమల రాజేంద్ర కుమార్, మాడవేణు, గొట్టిముక్కల రామచంద్రయ్య, అడుగోవుల సుబ్బరాయుడు, మలవత్తు రమణయ్య, మాడ మస్తాన్, పుట్ట బాలాజీ, చింతగింజల సురేష్, బొడిచర్ల బాబు రావు, గుద్దంటి శివప్రసాద్, దొంతు వెంకటసుబ్బరాయుడు, కందగడ్డల నాగయ్య, పురుషోత్తం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని తమ ఐక్యతను తెలియజేసారు.

## డిక్లరేషన్ ఇచ్చి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవాలి

వెంకటగిరి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవాలంటే తప్పనిసరిగా డెకరేషన్స్ ఇవ్వాల్సిందే గాని బిజెపి నియోజకవర్గ మాజీ కన్వీనర్ టిటి మణి తెలిపారు. వెంకటగిరిలోని బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి క్రిస్టియన్ కాకపోతే డిక్లరేషన్ ఇచ్చేందుకు భయమెందుకు అని తెలిపారు. సమావేశంలో దశరథరామ్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

## సంపద కేంద్రాలు పంచాయతీలకు వరం

బాలాయపల్లి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : చెత్త నుండి సంపద కేంద్రాలు పంచాయతీలకు ఒక వరం లాంటివని డిఎల్పిఓ వెంకటరమణ తెలిపారు. బాలాయపల్లిలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాన్ని తిరిగి ఎంపిడివో డిజె వినిల్ కుమార్ సర్పంచి దట్టం అంజలితో కలిసి ప్రారంభించారు. అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పంచాయితీ కార్యదర్శి లీలావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు లేనందున గొల్లగుంట పాఠశాల మూసివేత

బాలాయపల్లి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:



మండలంలోని గొల్లగుంట పాఠశాలలో విద్యార్థులు లేనందున అక్టోబర్ ఒకటో తేది నుండి మూసివేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఖిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వాక్యం, వెంకటరెడ్డి పల్లి, నిండలి పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గొల్లగుంట పాఠశాలలో ఒకే విద్యార్థి ఉన్నందున ఆ విద్యార్థినిని చిలమనూరు పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట పలు ఉపాధ్యాయులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన

చిల్లకూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :





చిల్లకూరులోని సాయి విద్యా నికేతన్ జూనియర్ కళాశాలలో సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ హాస్పిటల్ ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. లక్ష్మీచే క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. చీఫ్ మెడికల్ ఆఫీసరు డా. టి.లక్ష్మి మాట్లాడుతూ మన జీవన శైలిలో వచ్చిన మార్పు, శ్రీ రసాయనాలుతో కూడిన కూరగాయలు పండ్లు, జంక్ ఫుడ్స్ వాటితో చేసిన ఆహార పదార్థాల వినియోగం వలన క్యాన్సరు వచ్చి అవకాశం ఉన్నది. సునీత సేవా సంస్థ అధ్యక్షులు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్ క్రాస్ క్యాన్సరు హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీచే క్యాన్సరు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కాలేజ్ ప్రిన్సిపాల్ వి. అరుణ్ కుమార్, సిస్టరు పద్మ, శ్రావణి రెడ్డి, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన సేవలను అందజేయాలి

గూడూరు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందజేయాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా కార్యక్రమం అధికారి వైద్యుడు శ్రీనివాస రావు తెలిపారు. గూడూరు మండలం పోటుపాలెం గ్రామం ఉన్నా ప్రభుత్వ పాఠశాల ఆయన సందర్శించారు. గ్రామంలో గర్భవతులను వైద్య పరీక్షలు చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గర్భవతులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై అవగాహన సదస్సు కల్పించారు. అనంతరం సచివాలయం వారిగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. దానిలో భాగంగా డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ జ్యోతి, ఎస్ఓ నాగేంద్ర, సూపర్‌వైజర్ నరేష్, టెక్నీషియన్ ప్రకాష్, సూపర్వైజర్ ఉమ, ఎఎన్ఎంఎస్ సౌజన్య, కవిత, శశికళ, మణి తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోన ఆలయంను అభివృద్ధి చేయిస్తా : ఎమ్మెల్యే

వెంకటగిరి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :



రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన పెంచలకోన నరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. అక్టోబర్ నెల మూడవ తేది నుండి 12వ తేది వరకు జరిగే దసరా నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే రామకృష్ణకు ఆలయం ఈవో పి. శ్రీనివాసులు ఆహ్వాన పత్రిక అందజేశారు. పెంచలకోనలో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. పెనుశిల లక్ష్మి నరసింహ స్వామి ఆలయం అభివృద్ధి పై సిఎం మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

## ఆగిన పక్కా గృహాలు వెంటనే పూర్తి చేయాలి



వాకాడు, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త : 2014 నుండి 2024 సంవత్సరం వరకు ఆగిన ప్రభుత్వ పక్కా గృహాలు వెంటనే పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు పడతాయని ఎంపిడిఓ మనోహర్ గౌడ్ తెలిపారు. శనివారం వాకాడు మండపం కల్లూరు పంచాయితీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు దువ్వూరు జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పేద, బడుగు, బలహీన వర్గాలు గత ప్రభుత్వంలో పక్కా గృహాలు నిర్మించుకున్న వారు కూడా చంద్రబాబు నాయుడు బిల్లులు వేస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు కార్తీక్ , వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నాలుగు పంచాయితీలలో సర్పంచుల, వివిధ శాఖల అధికారులు గ్రామ సభ నిర్వహించారు.

